క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



జన్నివలస పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ దిలీప్ చక్రవర్తి

తెర్లాం: మండలంలోని ఎం.ఆర్.అగ్రహారం, కూనాయవలస, జన్నివలస, వెలగవలస, రంగప్పవలస గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ దిలీప్ చక్రవర్తి మంగళవారం పరిశీలించారు. అనంతరం అక్కడి మౌలిక సదుపాయాలపై బీఎల్‌వోలను ఆరాతీశారు. పోలింగ్ సమయం నాటికి మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, ర్యాంప్ వంటి సౌకర్యాలు ఉండేలా చూడాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

వంగర: ఎన్నికల దృష్ట్యా మండలంలోని పటువర్ధనం గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎస్ఐ వై.వి.జనార్దన్ మంగళవారం పరిశీలించారు. ఎన్నికల వేళ గ్రామాల్లో గొడవలు జరగకుండా చూసుకోవాలని గ్రామ పెద్దలకు సూచించారు. శాంతియుత వాతావరణంలో పోలింగ్ జరిగేలా సర్పంచ్‌లు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

హద్దురాళ్ల ఏర్పాటుకు చర్యలు



గురవాం గ్రామం వద్ద సిద్ధం చేసిన హద్దురాళ్లు

రాజాం: భూముల రీసర్వేలో భాగంగా సర్వే పూర్తయిన గ్రామాల్లో భూములకు సంబంధించి, హద్దురాళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ ఎస్.కె.రాజు ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. మండలంలో మొత్తం 21 గ్రామాల్లో ప్రాథమిక సర్వే పూర్తి చేయడంతో పాటు 14 గ్రామాల్లో హద్దురాళ్లు వేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన గ్రామాల్లో కూడా హద్దురాళ్లు వేసి, రైతులకు జగనన్న శాశ్వత భూ హక్కుపత్రాలు అందిస్తామన్నారు.

శరవేగంగా రోడ్డు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న రోడ్డు ఇదే..

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట నుంచి వన్నలి గ్రామం వరకు ప్రధాన బీటీ రోడ్డు మరమ్మతులు శరవేగంగా జరుగుతున్నాయి. దాదాపు 10 కిలోమీటర్ల మేర రోడ్డును బాగు చేస్తున్నట్లు ఏఈ నాగభూషణరావు తెలిపారు. ప్రస్తుతం రోడ్డు పనులు జరుగుతుండడంతో ప్రయాణికులు, వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని కూరాకుల వీధిలో ఉన్న రామలింగేశ్వరాలయం వద్ద శివపార్వతుల కల్యాణోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి



రక్తం దానం చేస్తున్న యువకులు

రాజాం సిటీ: గ్రామీణ ప్రాంతాల నుంచి యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని నైరెడ్ డైరెక్టర్ ఎం.రాజేష్ కోరారు. మంగళవారం స్థానిక నైరెడ్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి, కాసేపు మాట్లాడారు. రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యమే తప్ప అనారోగ్యం ఉండదన్నారు. మనమిచ్చే రక్తం ఆపదలో ఉన్న ఎంతోమందిని రక్షించడమే కాకుండా వారి కుటుంబానికి అండగా నిలబడే ప్రాణాన్ని నిలుపుతోందన్న విషయం అందరూ గుర్తుపెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాజాం చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, నైరెడ్ మేనేజర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లే నిజమైన సంక్షేమ సేవకులు

- వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



బాడంగి: సన్మానం పొందిన వలంటీర్లతో ఎమ్మెల్యే శంబంగి, ఎంపీ బెల్లాన తదితరులు

బాడంగి: ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఒక్క రూపాయి అవినీతి, వివక్ష లేకుండా అందిస్తున్న వలంటీర్లే నిజమైన సంక్షేమ సేవకులు అని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి హాజరైన ఎంపీ, ఎమ్మెల్యేలు వలంటీర్ల సేవలను ప్రశంసించారు. ఎంపీ బెల్లాన మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ప్రవేశపెట్టారని, ఆయా వ్యవస్థల ద్వారా ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలు, పథకాలు అందుతున్నాయన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు మన రాష్ట్రంలోని సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఆదర్శంగా తీసుకుంటున్నాయని, వారి రాష్ట్రాల్లో కూడా ఈ వ్యవస్థలను అమలు చేసే దిశగా ఆలోచన చేస్తున్నాయన్నారు. ఇంతటి మంచి గుర్తింపు తీసుకువచ్చిన సీఎం జగనన్నకు అండగా నిలిచి, రుణం తీర్చుకోవాలని కోరారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా ఆ పార్టీకి చెందిన జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదని, చివరికి ఆ పార్టీకి చెందిన వారికే పథకాలు దక్కువన్నారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతోందన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవని, ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే గెలిపించాలని, ఆ దిశగా పార్టీ శ్రేణులంతా కృషి చేయాలన్నారు. ఎన్నికల వేళ టీడీపీ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మి, మరోసారి మోసపోవద్దని హితవుపలికారు. ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ సీఎం జగనన్న వలంటీర్ల సేవలను గుర్తిస్తూ వారికి నగదు పురస్కారాలు అందివ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. వలంటీర్లంతా వలంటీర్ కాకముందు, వలంటీర్ అయిన తర్వాత సమాజంలో లభించిన గుర్తింపు, దక్కిన గౌరవం గుర్తుంచుకోవాలన్నారు. ఈ కృతజ్ఞతా భావం చాటుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రానున్న ఎన్నికల్లో మీ పరిధిలోని కుటుంబాల ఓట్లు అన్నీ వైఎస్సార్ సీపీకే దక్కేలా చూడాలన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు వలంటీర్ వ్యవస్థపై చేసిన ఆరోపణలు, వలంటీర్లను కించపరుస్తూ వారు చేసిన వ్యాఖ్యలు జ్ఞప్తికి తెచ్చుకోవాలన్నారు. వలంటీర్ వ్యవస్థ తీసుకువచ్చి, వలంటీర్లకు సమాజంలో సముచితమైన గౌరవం దక్కేలా చేసిన ఏకైక వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయనకు మనమంతా అండగా నిలవాలని కోరారు. అనంతరం సేవారత్న పురస్కారానికి ఎంపికైన వలంటీర్లను దుశ్శాలువా, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా జేసీఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, వైస్ ఎంపీపీ రమేష్, వాసిరెడ్డి కిరణ్‌కుమార్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయల్, ఎంపీడీవో ఆంజనేయులు, తహసీల్దార్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.



తెర్లాం: ఎంపీడీవో కార్యాలయ వద్ద వలంటీర్లకు వందనం కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి, తదితరులు

నేడు వలంటీర్లకు వందనం..

తెర్లాం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో బుధవారం ఉదయం నిర్వహించనున్న వలంటీర్లకు వందనం కార్యక్రమానికి సంబంధించి, ఎంపీడీవో బి.మధుసూదనరావు ఆధ్వర్యంలో చేపడుతున్న ఏర్పాట్లను వారు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో జరగనున్న ఈ కార్యక్రమానికి బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని గ్రామాల వలంటీర్లు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో డీవీ అప్పారావు, ఎంఈవో త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

బోధనా మెలకువలు నేర్చుకోవాలి



తెర్లాం: స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో త్రినాథరావు



రేగిడి: పనసలవలస స్కూల్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

తెర్లాం: స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరైన ఉపాధ్యాయులంతా బోధనలో మెలకువలను నేర్చుకోవాలని ఎంఈవో త్రినాథరావు సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరైన ఆయన ప్రస్తుతం మారుతున్న విద్యావ్యవస్థకు అనుగుణంగా ఉపాధ్యాయులు తయారు కావాలని తెలిపారు. స్కూల్ కాంప్లెక్స్‌లలో అన్ని సబ్జెక్టులలో ఉపాధ్యాయులకు నిపుణులైన ఉపాధ్యాయులతో అనేక మెలకువలు నేర్చుకునేందుకు అవకాశం కల్పించడం జరుగుతోందని, ప్రతీ ఉపాధ్యాయుడు సబ్జెక్టులో మంచి నైపుణ్యం సంపాదించాలన్నారు. మండలంలోని పెరుమాళి, వెలగవలస జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు కూడా ఎంఈవో వెళ్లి, పలు సూచనలు చేశారు.

రేగిడి: ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు కొత్త కొత్త విషయాలు నేర్చుకుని, అధునాతన పద్ధతిలో విద్యాబోధన చేయాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సూచించారు. మంగళవారం మండలంలోని పనసలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని సందర్శించిన ఆయన ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా విద్యార్థుల హాజరుశాతం పెరిగేలా చూడాలన్నారు. అనంతరం టీఎల్ఎం(టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) వినియోగంపై ఆరాతీశారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బి.సునీత, సంకిలి స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఎం.రామినాయుడు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

దేవుడుబాబుకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



దేవుడుబాబును దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

రామభద్రపురం: మండలంలోని కొండకెంగువ గ్రామంలో నిత్యానందస్వామి దేవుడుబాబు జాతరకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మంగళవారం హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఎమ్మెల్యేకు వేదపండితులు ఘనస్వాగతం పలికి, ఎమ్మెల్యే పేరిట ప్రత్యేకాభిషేకాలు నిర్వహించి, స్వామి వారి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం గ్రామస్తులను ఎమ్మెల్యే కలిసి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. అన్నివర్గాల బాగు, అన్నిప్రాంతాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న సీఎం జగనన్నకు అండగా నిలవాలని కోరారు. ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేసి, రాష్ట్రంలోని సంక్షేమ పాలనను కొనసాగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బెల్లాన ప్రసాద్, పార్టీ నాయకులు శంబంగి శ్రీకాంత్, బెవర ప్రసాద్, కంచుపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి పూజలు



రాజాం: రాజగోపాలస్వామి ఆలయంలో భక్తుల పూజలు



తెర్లాం:ఎన్.బూర్జవలసలో భీష్మ ఏకాదశి పూజలు



రేగిడి: తాటిపాడులో ఘటాలతో భక్తులు

రాజాం: మండలంలోని పలు వైష్ణవ ఆలయాల్లో భీష్మ ఏకాదశి పూజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయాలకు చేరుకున్న భక్తులు ప్రత్యేక పూజలు చేసి, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లేలా దీవించమని వేడుకున్నారు. భీష్మ ఏకాదశి పురస్కరించుకుని, రామమందిరాలు, వెంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, రాజగోపాలస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

రేగిడి: మండలంలోని తాటిపాడు గ్రామంలో భీష్మ ఏకాదశి పూజలు మంగళవారం జరిగాయి. గ్రామానికి చెందిన గాదం కుటుంబీకులు, గ్రామస్తులు తమ ఆరాధ్య దేవతగా కొలిచే బాలఅన్నమ్మ పేరంటాలుకు ఘటాలు, ముర్రాటలు సమర్పించారు. ఏటా భీష్మ ఏకాదశి రోజున ఘటాలు ఎత్తడం, బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో ధర్మకర్త గాదం గోవిందరావు, సర్పంచ్ పేట బాబూరావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: భీష్మ ఏకాదశి సందర్భంగా మండలంలోని ఆలయాలు భక్తులతో మంగళవారం కిటకిటలాడాయి. కురుక్షేత్రంలో అంపశయ్యపై భీష్ముడు ప్రాణాలు విడిచి, స్వర్గానికి వెళ్లాడని నానుడితో ఏటా ఈ భీష్మ ఏకాదశి జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో ఇదేరోజున చనిపోయిన మనుషులు కూడా స్వర్గానికి వెళ్తారన్నది భక్తుల ప్రగాఢ విశ్వాసం.

తెర్లాం: మండలంలోని చిన్నయ్యపేట, ఎన్.బూర్జవలస గ్రామాల్లో భీష్మ ఏకాదశి పూజలు మంగళవారం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రాజాం సిటీ: స్థానిక కోర్టు ఆవరణలో మార్చి 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు ఓ ప్రకటనలో మంగళవారం కోరారు. రాజీకి అనుకూలమైన సివిల్, క్రిమినల్, ప్రీలిటిగేషన్ కేసులన్నింటినీ ఇరుపార్టీల అంగీకారంతో పరిష్కరించనున్నామని తెలిపారు. సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజు వాపసు కూడా ఇవ్వనున్నామన్నారు. పోలీసులు కూడా తమ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసులకు సంబంధించి, కక్షిదారులకు లోక్‌అదాలత్ సేవలపై అవగాహన కల్పించాలన్నారు.

వృద్ధాశ్రమ నిర్మాణానికి ఆర్థికసాయం

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని కొండంపేటలో కొత్తగా నిర్మిస్తున్న అనాథ వృద్ధాశ్రమానికి దాతలు ఆర్థికసాయం అందిస్తున్నారు. శ్రీకాకుళం రోడ్డులోని సప్తగిరి ఫిల్లింగ్ స్టేషన్ ఎండీ ఎ.కామేశ్వరరావు రూ.25 వేలను తన వంతు సాయంగా ఆశ్రమ నిర్వాహకులు పి.శ్రీనివాసరావుకు మంగళవారం అందజేశారు. ఆశ్రమం పూర్తిస్థాయిలో సిద్ధమయ్యేందుకు దాతలు సహకరించాలని కోరారు.

ఆపన్న హస్తం



బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: ఆపదలో ఉన్నవారికి సీఎం సహాయ నిధి అందించి ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంటోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఐదుగురు బాధితులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10.10 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం అందజేశారు. నాలుగున్నరేళ్లలో సీఎం సహాయనిధి ద్వారా నియోజకవర్గంలోని 113 మంది బాధితులకు రూ.కోటి 33 వేలు ప్రభుత్వం మంజూరు చేసినట్టు వెల్లడించారు. ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య ఖర్చుల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచినట్టు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు బలగ సాయికృష్ణ, చప్ప శేఖర్, గొట్టాపు అప్పారావు, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసచివాలయాలతో పారదర్శక సేవలు



తాలాడ సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

సంతకవిటి: గ్రామాల్లోని సచివాలయాల ద్వారా ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని తాలాడ గ్రామ సచివాలయాన్ని మంగళవారం సందర్శించిన ఆయన అక్కడి రికార్డులు, ఉద్యోగుల పనితీరు, ప్రజాసేవలు పరిశీలించారు. స్పందన ద్వారా తెలుస్తున్న ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. ఉద్యోగులు సమయానికి విధులకు హాజరు కావాలని, విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవన్నారు.

బాగా చదివి మంచిపేరు తెచ్చుకోవాలి

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల జిల్లా కన్వీనర్ తోట పద్మజ



వంగర: బహుమతులు అందిస్తున్న గురుకులాల జిల్లా కన్వీనర్ పద్మజ, ఎంపీపీ సురేష్ ముఖర్జీ



మెంటాడ: విద్యార్థుల విద్యాసామర్థ్యాలు తెలుసుకుంటున్న ఎంపీడీవో లక్ష్మీబాయి

వంగర: విద్యార్థులు బాగా చదివి, మంచిపేరు తెచ్చుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల జిల్లా కన్వీనర్ తోట పద్మజ అన్నారు. మండల పరిధిలోని మడ్డువలస దగ్గరున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో మంగళవారం జరిగిన ఫేర్‌వెల్ డేకు హాజరైన ఆమె విద్యార్థులను ఉద్దేశించి, కాసేపు మాట్లాడారు. ప్రతీ విద్యార్థి తనకంటూ ఓ లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని, ఆ దిశగా కృషి చేయాలన్నారు. జీవితంలో మంచి స్థాయిలో స్థిరపడాలంటే ఇక్కడి నుంచే ఉన్నతంగా ఆలోచించి, పునాదులు వేసుకోవాలన్నారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ మాట్లాడుతూ గురుకుల విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తూ కోట్ల రూపాయలు వెచ్చిస్తోందన్నారు. విద్యార్థులంతా చదువులో బాగా రాణించి, మంచి మంచి స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. అనంతరం వారు పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అంతకుముందు విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను గురుకులాల జిల్లా కన్వీనర్ పద్మజ పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన రుచి, శుచి కలిగిన భోజనం పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.పద్మావతి, వైఎస్సార్ సీపీ నేత బి.వెంకటరావు పాల్గొన్నారు.

మెంటాడ: మండలంలోని ఆంధ్ర వద్ద ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలను ఎంపీడీవో లక్ష్మీబాయి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రభుత్వం చాలా ఖర్చు చేస్తోందని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా బాగా చదువుకుని, ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. ఆ తర్వాత మధ్యాహ్న భోజనం వంటకాలు పరిశీలించి, నాణ్యమైన రుచి, శుచితో కూడిన భోజనం విద్యార్థులకు పెట్టాలన్నారు.

ప్రజల వద్దకే మెరుగైన వైద్యసేవలు



రామభద్రపురం: మందుల కిట్లు అందజేస్తున్న సర్పంచ్ లక్ష్మి



బొబ్బిలి: కోమటిపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వైద్యారోగ్య సిబ్బంది



తెర్లాం: నందబలగలో మందుల కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో మధుసూదనరావు



మెంటాడ: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ సన్యాసినాయుడు

రామభద్రపురం: ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని నాయుడువలస గ్రామ సర్పంచ్ నడిమింటి లక్ష్మి అన్నారు. మండలంలోని నాయుడువలస గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన రోగులకు ఆరికతోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రత్నదీపక్‌తో కూడిన వైద్య బృందం ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. పెద్ద వ్యాధులతో బాధపడుతున్న వారిని, ఆపరేషన్లు అవసరమైన వారిని జిల్లా ఆస్పత్రులు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఏవో అక్కారావు, ఈవోపీఆర్‌డీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోమటిపల్లి గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరానికి హాజరైన రోగులకు వైద్యసిబ్బంది తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని నందబలగ గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరానికి హాజరైన రోగులకు తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బాడంగి సీహెచ్‌సీ ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ పెద్దింటి నాగేశ్వరరావు తదితరులు వైద్య సేవలందించారు. ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన ఎంపీడీవో బి.మధుసూదనరావు ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెర్లాం పీహెచ్‌సీ సీహెచ్‌వో భాస్కరరావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మెంటాడ: ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని లోతుగెడ్డ గ్రామంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి హాజరైన ఆయన ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అందరూ బాగుండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తపన అని అన్నారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి వచ్చిన రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ శిరీష, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ లోకప్రియ, సర్పంచ్ బీమారావు, వైస్ సర్పంచ్, సచివాలయం కన్వీనర్ సూరెడ్డి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు

బొబ్బిలి: రానున్న వేసవి దృష్టిలో ఉంచుకుని, ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్.వి.మురళీకృష్ణారావు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఆయన పట్టణ పరిధిలోని 31వ వార్డుల్లోనూ తాగునీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. అలాగే అన్నివార్డులు పరిశుభ్రంగా ఉండేలా పారిశుద్ధ్య చర్యలు ముమ్మరం చేయాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలోని షాపింగ్ కాంప్లెక్స్ లీజు వేలంను పలువురు కౌన్సిలర్లు అడ్డుకోవడంతో వేలంపాటను వాయిదా వేశారు. షాపింగ్ కాంప్లెక్స్ బకాయిలు ఎందుకు వసూలు చేయలేదని కౌన్సిలర్ గోవిందరావుతో పాటు పలువురు కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. మెయిన్ రోడ్లతో తప్ప మిగతా చోట్ల అంతగా పరిశుభ్రతా చర్యలు చేపట్టడం లేదని వైస్ చైర్మన్ రమాదేవి సమావేశం దృష్టికి తీసుకువెళ్లారు. రైల్వే అండర్ బ్రిడ్జి దగ్గరున్న పలు సమస్యలను పరిష్కరించాలని కౌన్సిలర్ టి.పార్వతి కోరారు. సభ్యులు అడిగిన ఏ ఒక్క ప్రశ్నకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పకపోవడంతో చైర్మన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలని అధికారులకు సూచించారు.